## నేడు మెగా జాబ్‌మేళా

**మలక్‌పేట:** తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసుల విభాగం సహకారంతో ఈనెల 5 తేదిన మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోరారు. మెరీడియన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందని తెలిపారు. వివరాలకు 88867 11991, 90300 47303 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

## డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

**తలకొండపల్లి:** 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమోతో పాటు తదితర ధ్రువపత్రాల జిరాక్స్‌లతో డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు నీటి పారుదలశాఖ ఎస్ఈ హైదర్‌ఖాన్, ఈఈ బన్సీలాల్, డిప్యూటీ ఈఈ ఉషారాణి, హెచ్ఎండీఏ ఈఈ పద్మలతో కలిసి పెద్ద చెరువు పరిసర ప్రాంతాలను సోమవారం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పరిశీలించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ. 18.90 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్ని హంగులతో పర్యాటక కేంద్రంగా పెద్ద చెరువు త్వరలో మారనున్నట్లు తెలిపారు.

# మన ఉత్తమ ఉపాధ్యాయులు

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించిన విద్యాశాఖ
- నేడు అవార్డుల ప్రదానోత్సవం



శాంతకుమారి, ఎండీ.ముర్తుజా, రచన, పి.స్వామి, డి.కుమార్, పి.చంద్రశేఖర్, భార్గవి, ఆర్.శిరీష, కె.సుజాత, లక్ష్మయ్య, మల్లీశ్వరి, స్వాతి, శంకర్, నర్సింహ

**కందుకూరు:** జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా కందుకూరు మండలం నుంచి మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారులు వివరాలు వెల్లడించారు. శాంతకుమారి (సైన్స్ టీచర్ నేదునూరు జెడ్పీహెచ్ఎస్), ముర్తుజా (ఇంగ్లీషు టీచర్, లేమూరు జెడ్పీహెచ్ఎస్), రచన (లెక్కల టీచర్, కందుకూరు బాలికల జెడ్పీహెచ్ఎస్), పి.స్వామి (పీఈటీ, పులిమామిడి జెడ్పీహెచ్ఎస్), డి.కుమార్ (తెలుగు టీచర్, కందుకూరు బాలుర జెడ్పీహెచ్ఎస్), పి.చంద్రశేఖర్ (ఎస్‌జీటీ, మాదాపూర్ యూపీఎస్), భార్గవి (ప్రత్యేకాధికారి, కేజీబీవీ) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మంగళవారం నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి అధికారులు అవార్డులు అందించనున్నారు.

**మహేశ్వరం మండలం నుంచి..**

**మహేశ్వరం:** రాష్ట్ర విద్యాశాఖ సోమవారం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుల లిస్టులో మహేశ్వరం మండలం నుంచి పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని మండల విద్యాధికారి కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిలో శిరీష (ప్రధానోపాధ్యాయురాలు, మహేశ్వరం బాలికల ఉన్నత పాఠశాల), కె.సూజాత (స్కూల్ అసిస్టెంట్, పెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల), లక్ష్మయ్య (ఎస్ఏ, ఉన్నత పాఠశాల తుమ్మలూరు), మల్లేశ్వరి (పీఈటీ, ఉన్నత పాఠశాల తుక్కుగూడ), స్వాతి (పీఎస్, ప్రాథమికోన్నత పాఠశాల మన్సాన్‌పల్లి), శంకర్ (ఎస్జీటీ, పీఎస్, దేవేందర్‌నగర్ కాలనీ), కావలి నర్సింహ (ప్రైవేట్ టీచర్, సూర్యోదయ విద్యానికేతన్, అమీర్‌పేట్) మండలంలో మొత్తం ఏడు మంది ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మంగళవారం వీరు అవార్డులు అందుకోనున్నారు.

## స్థానికులకే ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి



డబుల్‌బెడ్‌రూం దరఖాస్తుదారులతో బీజేపీ నాయకులు

- తుక్కుగూడ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్

**తుక్కుగూడ:** మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు కేటాయించాలని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ కాంటెకర్ మధుమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో డబుల్‌బెడ్‌రూం దరఖాస్తుదారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు... స్థానికంగా నిర్మించిన డబుల్ ఇళ్లను ఇక్కడి నిరుపేదలకు ఇవ్వకుండా నగరానికి చెందిన ముస్లిం మైనార్టీలకు ఇవ్వడం ఎంతవరకు సమజంసం అని ప్రశ్నించారు. మంత్రి సబితారెడ్డి తన ఏకపక్ష నిర్ణయాలతో ఇతర ప్రాంతానికి చెందినవారికి ఇక్కడ ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో వందాలాదిమంది నిరుపేదలు సొంత ఇళ్లు లేక కిరాయి ఇంట్లో ఉండి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికులకు డబుల్ ఇళ్లు కేటాయించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, బి.విలాస్, ఆర్.రాజు, నాయకులు బి.రాజుగౌడ్, సుధాకర్, మధన్‌మోహన్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌నాయక్, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఘటం ఊరేగింపు



ఘటం ఊరేగింపులో భక్తులు

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ 40వ వార్షిక, కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని రావిర్యాల గ్రామంలోని భక్తుడు నాగేశ్వర్‌గౌడ్ ఇంటి నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకుపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రత్నం, పాలకమండలి సభ్యులు, దేవాదాయధర్మదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రైతుబజార్ ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 17. వంకాయ 18, బెండ 23, పచ్చిమిర్చి40, కాకర 23, బీర 18, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 33. దొండ 23, ఆలు 23, ఉల్లి 24, గోకర 28, దోస 18, సొర 11, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 45, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 45, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 32. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



పాఠాలు బోధిస్తున్న ఇబ్రాం శేఖర్

**బడంగ్‌పేట్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టుదలతో చదవాలని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా బాలాపూర్ మండలం నుంచి ముగ్గురు టీచర్లు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

**హుడాకాంప్లెక్స్:** సరూర్‌నగర్‌లోని శ్రీనిధి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని జననం గురించి దశావతారాల ప్రాముఖ్యత, దుష్టశిక్షణ, శిష్టరక్షణ అన్న గీతోపదేశాన్ని తెలియజేశారు. విద్యార్థులు శ్రీకృష్ణుని జననం, దశావతారాల నృత్యరూపకం ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీనిధి పాఠశాల చైర్మన్ డా.నల్లపాటి వెంకటేశ్వర్‌రావు, ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి, ప్రిన్సిపాల్ ఆరుట్ల శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.